క్లుప్తంగా

వ్యాసరచన పోటీలు

డిచ్‌పల్లి: జనవిజ్ఞాన వేదిక, డిచ్‌పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని 8, 9, 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ తలారి సాయన్న శుక్రవారం తెలిపారు. ఒక్కో పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులకు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. 'శాస్త్రీయ దృక్పథం – నేటి అవసరం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 28న ఉదయం 11 గంటలకు ఈ పోటీలు జరుగుతాయన్నారు.

స్వగ్రామానికి చేరుకున్న యువకుడి మృతదేహం

ఇందల్వాయి: గత ఆదివారం ఉదయం దుబాయ్‌లో గుండెపోటుతో మృతి చెందిన విజయ్(27) అనే యువకుడి మృతదేహం ఆయన పని చేసిన కంపెనీ, గల్ఫ్ మిత్రుల సహకారంతో స్వగ్రామం గన్నారం శుక్రవారం చేరుకుంది. మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. విజయ్ మృతదేహానికి ఆయన తల్లి లక్ష్మి తలకొరివి పెట్టడం చూసి గ్రామస్తులంతా చలించిపోయారు. విజయ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పాలాభిషేకం



జక్రాన్‌పల్లి: ఇటీవల శాసనసభలో బీసీ సమగ్ర కుల గణన తీర్మానానికి ఆమోదం తెలపడాన్ని హర్షిస్తూ జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ యువజన విభాగం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యే భూపతిరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు వినోద్, పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మద్దుల రమేష్, యూత్ ప్రధాన కార్యదర్శి డిష్ రాజు, నరేష్, జీవన్, సాగర్, రత్నగిరి, రాజేష్‌గౌడ్, నారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలకు ఎంపిక



సిరికొండ: రాష్ట్ర స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలకు సత్యశోధక్ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 25న హైద్రాబాద్‌లో నిర్వహిస్తున్న పోటీల్లో వీరు పాల్గొంటారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో చాంపియన్‌షిప్ సాధించిన శివాని, కార్తీక, అనన్య పాటిల్, సాధ్వీలు అబాకస్‌లో, యశ్వంత్, వైశ్విక, నవ్యశ్రీలు వేదిక్ మ్యాథ్స్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆ విద్యార్థులను పాఠశాలలో శుక్రవారం అభినందించారు. ప్రిన్సిపాల్ నర్సయ్య, గంగారెడ్డి, శంకర్, రాజు, వనిత, జ్యోతి పాల్గొన్నారు.

చెవిటి మూగ విద్యార్థులకు అన్నదానం

నిజామాబాద్‌నాగారం: బోర్గాం వద్ద గల సత్యనారాయణ ఆలయం వద్ద గల చెవిటి మూగ పిల్లలకు శుక్రవారం ధర్మపురి సురేందర్ జన్మదినాన్ని పురస్కరించుకొని వారి అభిమానులు విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దాత్రిక రమేష్, రాంప్రసాద్ చటర్జీ శ్రీహరి, బంజ రమేష్, నరేష్ గౌడ్, శ్రీకాంత్, బినయ్, తదితరులు ఉన్నారు.

బోర్గం పాఠశాలలో సేవా కార్యక్రమాలు



నిజామాబాద్‌రూరల్: మోపాల్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం లీడ్ ప్రోగ్రామ్‌లో భాగంగా కాకతీయ సాండ్ బాక్స్, దేశ్ పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో 12 మంది ట్రైనింగ్ విద్యార్థులు పాఠశాలలో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాలలో ఉన్న వివిధ గదులకు సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. పాఠశాల మెయిన్ గేట్‌కు నూతనంగా కలర్ వేశారు. ప్రాజెక్టు వర్కులో భాగంగా వంట గదిని శుభ్రపరిచి గార్డెన్‌లో విత్తనాలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శంకర్, లీడ్ టీమ్ కో–ఆర్డినేటర్ సాయిచరణ్, 12 మంది విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యౌషధ వితరణ

నిజామాబాద్ రూరల్: మోపాల్ మండలంలోని నర్సింగపల్లి ఇందూర్ తిరుమల క్షేత్రంలో శుక్రవారం సంతానం లేని వారికి మాఘ పౌర్ణమి పురస్కరించుకొని దివ్యౌషధ వితరణ చేశారు. ఈ సందర్భంగా ఇందూర్ తిరుమల క్షేత్రం ప్రధాన సేవకులు నర్సింహా దాసు తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి 9:30 గంటల వరకు ప్రత్యేక పూజలు చేసి సంతానం లేని వారికి దివ్యౌషధం వితరణ చేసినట్లు పేర్కొన్నారు. ఈ దివ్యౌషధాన్ని నిష్ఠతో భక్తితో పాటిస్తే ఫలితం ఉంటుందని అన్నారు.

టార్గెట్ రూ.53 కోట్లు

- 8 బృందాలతో ఆస్తి పన్ను వసూలు
- 125 మందికి నోటీసులు.. వారంలో చెల్లించకుంటే జప్తు
- ప్రచార వాహనాలూ రెడీ



ఆస్తి పన్ను చెల్లించకుంటే జప్తు చేస్తామని నగరంలో ప్రచారం చేస్తున్న మున్సిపల్ వాహనం

నిజామాబాద్‌నాగారం: మున్సిపల్ శాఖకు ఆస్తి పన్ను వసూళ్లు తలకు మించిన భారంగా మారింది. ఆస్తి పన్ను వసూళ్ల కోసం అధికారులు కుస్తీ పడుతూనే ఉన్నారు. ప్రతి నిత్యం వసూళ్లు ఒక మాదిరిగా ఉంటే.. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఉదయం నుంచి రాత్రి వరకు విధులు నిర్వహిస్తూ పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించారు..

ఇప్పటికే రూ.32 కోట్లు వసూలు

నగరంలో 60 డివిజన్లు, వీటి పరిధిలో 84 వేల ఇళ్లు ఉన్నాయి. సుమారు 35 వేల ఇళ్లకు సంబంధించి ఆస్తి పన్ను బకాయిలు(సుమారు రూ.32 కోట్లు) వసూళ్లయ్యాయి. మరో 18 వేల ఇళ్లకు సంబంధించి ఆస్తి పన్ను చెల్లించడానికి మార్చి 31 వరకు అనుమతి ఉంది. మిగతా 31వేల ఇళ్లకు సంబంధించి ఆస్తి పన్ను బకాయిలు కచ్చితంగా వసూళ్లు కావాల్సిందే. మొత్తం రూ.53 కోట్లలో ఇంకా రూ.21 కోట్లు వసూలు కావాల్సి ఉంది.

మున్సిపల్ రిపోర్ట్

వెయ్యి మంది జాబితా రెడీ..

నగరంలో మున్సిపల్ ఆస్తి పన్ను బకాయిల విషయాన్ని అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ముఖ్యంగా మున్సిపల్ కమిషనర్ మకరందు ప్రత్యేకంగా దృష్టి సారించారు. కొన్ని సంవత్సరాలుగా ఆస్తి పన్నులు చెల్లించకుండా కాలం వెళ్లదీస్తున్న వారి జాబితాను తయారు చేయించారు. నూతనంగా వచ్చిన డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, ఆర్వో నరేందర్ ఆధ్వర్యంలో అత్యధికంగా బకాయిలు చెల్లించని వెయ్యి మంది జాబితాను సిద్ధం చేశారు. 8 బృందాలుగా నగరంలో బకాయిల దారుల ఇంటికి వెళ్లనున్నారు. ఒక్కో బృందంలో ఆర్ఐ, బిల్ కలెక్టర్లు, అసిస్టెంట్లు సైతం ఉండనున్నారు. అలాగే నగరంలో మొండి బకాయిదారులకు ఇప్పటికే మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. కచ్చితంగా వారం రోజుల్లో ఆస్తి పన్నులు చెల్లించాలని, లేకుంటే ఇళ్లు, సామగ్రి జప్తు చేస్తామని హెచ్చరించారు. 125 మందికి సంబంధించి రూ.5 కోట్ల వరకు వసూళ్లు కావాల్సి ఉంది.



సిబ్బందితో సమీక్షిస్తున్న డిప్యూటీ కమిషనర్



నగరంలో ఓ షాపింగ్‌మాల్ వద్ద ఆస్తి పన్ను వసూలు కోసం వెళ్లిన మున్సిపల్ అధికారులు

వంద శాతం వసూలుకు కృషి

నగరంలో ఆస్తి పన్నులు వంద శాతం వసూళ్లు చేయడానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నాం. ఆస్తి పన్నులు చెల్లించకుండా ఉంటే మాత్రం సహించేది లేదు. బకాయిదారుల జాబితాతో పాటు మొండి బకాయిదారుల జాబితాతో మా రెవెన్యూ యంత్రాంగం నగరంలో ఇంటింటికి తిరుగుతున్నారు. దీనిపై రోజూ సమీక్షిస్తూనే ఉన్నాం.

– రాజేంద్ర కుమార్, డిప్యూటీ కమిషనర్

నేటి చిత్రం..



మహాలక్ష్మీనగర్‌కాలనీలో తాళం వేసి ఉన్న పార్కు

అందుబాటులోకి వచ్చేదెప్పుడు?

నగరంలోని వినాయక్‌నగర్ మహాలక్ష్మీనగర్ కాలనీలో మున్సిపల్ అధికారులు పార్క్ కోసం స్థలాన్ని చదునుచేసి చుట్టూ కంచె వేశారు. అలాగే గేట్లు కూడా పెట్టారు. కంచె వేసి ఏడాదవుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. అధికారులు స్పందించి పార్కును వినియోగంలోకి తేవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్–నిజామాబాద్

ప్రస్తావించిన సమస్యలు పరిష్కరించాల్సిందే

- నగర మేయర్ దండు నీతూకిరణ్



అధికారులతో సమీక్షిస్తున్న నగర మేయర్

నిజామాబాద్‌నాగారం: కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు ప్రస్తావించిన సమస్యలపై సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలన చేసి పరిష్కరించాల్సిందేనని నగర మేయర్ దండు నీతూకిరణ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్లో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. డివిజన్‌లు, కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళి మనోహర్ రెడ్డి, డీసీపీ శ్యామకుమార్, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకర్, ఎలక్ట్రిసిటీ ఏడీఈలు రాజశేఖర్, వీరేశం, చంద్ర శేఖర్, మున్సిపల్ డీఈలు ఆనంద్ సాగర్, ముస్తాక్ అహ్మద్, రెవిన్యూ ఆఫీసర్ నరేందర్, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న సుధాకర్

ఖలీల్‌వాడి: దేశవ్యాప్తంగా రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీ సరిహద్దులో ఉన్న హర్యానా, పంజాబ్, ఇతర రాష్ట్రాల రైతులు ఢిల్లీకి చేరుకోగానే బీజేపీ ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి రైతులపై లాఠీచార్జి చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించి రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. 26న సీపీఐ, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో పార్టీ నాయకులు, రైతులు పాల్గొని బీజేపీ అనుసరిస్తున్న విధానాలను తిప్పి కొట్టాలన్నారు. నాయకులు పి.రంజిత్ కుమార్, రాధా కుమార్, ఆనంద్, సాయి కిరణ్ పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో గెలిచేది కాషాయ పార్టీనే

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

నిజామాబాద్‌నాగారం: రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో, మన ఇందూర్‌లో కాషాయ జెండా మరోసారి ఎగరడం పక్కా అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఔర్ ఏక్ బార్ మోదీ సర్కార్ కోసం మేము సైతం అంటూ బీజేపీలో బీఆర్ఎస్ డివిజన్ మాజీ అధ్యక్షులు సంతోష్ కులాచారి, హరీష్, వారి అనుచరులు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశం మొత్తం రామనామం ఏవిధంగా జపిస్తున్నారో, ఆ బాల రాముని ప్రతిష్ఠ చేసిన మోదీ పేరు కూడా దేశ ప్రజలందరూ జపం చేస్తున్నారన్నారు. పదేళ్లుగా ఒక్క అవినీతి మచ్చలేని నాయకుడిగా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులచారి దినేష్, జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ల లక్ష్మీ నారాయణ, కార్పొరేటర్ మెట్టు విజయ్, మండల అధ్యక్షుడు సుక్క మధు, పుట్టా వీరేందర్, రోషన్ లాల్ బోర, తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే మృతిపై సంతాపం

నిజామాబాద్‌నాగారం: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మరణ వార్త దిగ్భ్రాంతి కలిగించిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా శుక్రవారం సంతాపం ప్రకటించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న వారి జీవితం ఇలా అర్థంతంగా ముగిసిపోవడం బాధాకరమన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

శిరీష ఆత్మహత్యపై విచారణ జరిపించాలి



తెయూ(డిచ్‌పల్లి): బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థిని తెనుగు శిరీష ఆత్మహత్యపై సీబీఐ విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లో శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాజేశ్వర్ మాట్లాడుతూ.. ఏ యూనివర్సిటీలో లేని ఆత్మహత్యలు ఒక్క ట్రిపుల్ ఐటీలోనే ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. విద్యార్థుల ఆత్మహత్యలకు కారణాలు తెలుసుకోవడానికి గత ఏడాది ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి గోడ దూకి లోపలికి వెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు.

రాముడి పేరుతో రాజకీయం సరికాదు

- పాత డిజైన్ ప్రకారమే మంచిప్ప రిజర్వాయర్ నిర్మిస్తాం
- రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ రూరల్: రాముడి పేరుతో రాజకీయం చేయడం సరికాదని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకు హితవు పలికారు. మోపాల్ మండలంలోని సంత్ సేవాలాల్ 285వ జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని నిజామాబాద్ రూరల్, మోపాల్ ఉమ్మడి మండలాలకు చెందిన గిరిపుత్రులతో నర్సింగ్‌పల్లి శివారులో గల ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అధికారంలోకి వచ్చి మూడు నెలలు కాకముందే మహాలక్ష్మి పథకం కింద అర్హులందరికీ 15 రోజుల తర్వాత 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500కే సిలిండర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని అని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌పై నూతనంగా కమిటీ వేశారని మూడు, నాలుగు నెలల్లో కొత్త రెవెన్యూ చట్టం వస్తుందని పేర్కొన్నారు. మంచిప్ప రిజర్వాయర్ గురించి ఎవరూ ఆవేదన చెందకూడదని పాత డిజైన్ ప్రకారమే నిర్మిస్తామని, ముంపు గ్రామస్తులు ఎలాంటి భయాందోళన చెందవద్దని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో 3,500 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరయ్యాయని, అందులో ఎస్టీలకు(లంబాడీ) ప్రాముఖ్యత ఇచ్చే ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. జిల్లా ఎంపీ అరవింద్ నిజామాబాద్ జిల్లాలో ఏ ఒక్క గ్రామాన్ని సందర్శించి నిధులు మంజూరు చేయించలేదని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పని అయిపోయిందని అందులో ఎంపీగా పోటీ చేసేవారు ఎవరూ ముందుకు రావడం లేదని ఎద్దేవా చేశారు. సంత్ సేవాలాల్, జగదాంబ మాత, రామరావు మహారాజ్ విగ్రహాలను స్థాపించడానికి భూమి కావాలని మోపాల్ మండల గిరి పుత్రుడు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ఆర్డీవో ద్వారా నివేదిక అందుకొని భూమిని గిరి పుత్రులకు అందేలా చూస్తానని తెలిపారు. జిల్లా కిసాన్‌కేత్ అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి, డీసీసీబీ డెలిగేట్ చంద్రశేఖర్‌గౌడ్, ఆర్డీవో రాజేందర్, తహసీల్దార్ రామేశ్వర్, బంజార జిల్లా నాయకులు చంద్రునాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

వైభవంగా నల్లగుట్ట స్వామి బ్రహ్మోత్సవాలు



ధర్పల్లి: దుబ్బాక గ్రామంలోని నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా రోజుకొక అవతారంలో లక్ష్మీనరసింహ స్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు. శుక్రవారం రోజు ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి నల్లగుట్ట పైకి తీసుకెళ్లారు. ఈ బ్రహ్మోత్సవాలు మూడు రోజులపాటు కొనసాగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా రాజరాజేశ్వరస్వామి ఉత్సవాలు



సిరికొండ: రావుట్ల గ్రామంలో గల గాడిమాకుల రాజరాజేశ్వరస్వామి ఆలయంలో వార్షిక ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, వైస్ ఎంపీపీ రాజన్న, వీడీసీ చైర్మన్ రమేష్‌గౌడ్, డీసీసీ కార్యదర్శి ఎర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పంచామృత అభిషేకం



జక్రాన్‌పల్లి: కొలిప్యాక్ ఆనందగిరి లక్ష్మీనృసింహ స్వామి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేద పండితుడు దండాల మోహన్ శర్మ మంత్రోచ్ఛరణాల మధ్య వైభవంగా అభిషేకం చేశారు. అనంతరం ఆలయ, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిజామాబాద్‌నాగారం: నగరంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని టౌన్–1, 2, 3 ఏడీఈలు చంద్రశేఖర్, రాజశేఖర్, వీరేశంలు ఒక ప్రకటనలో తెలిపారు. పవర్ హౌస్, తిలక్ గార్డెన్, దుబ్బ, మిర్చి కాంపౌండ్, వినాయక నగర్, బోర్గం, దుబ్బ, న్యూ కలెక్టర్ ఆఫీస్, ముబారక్ నగర్, సుభాష్ నగర్, అర్సపల్లి, న్యూ హౌసింగ్ బోర్డు,– గూపన్ పల్లి–కొత్త కలెక్టరేట్ ఉప కేంద్రాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

26న స్వర్ణ ఖడ్గ బహూకరణ

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని ఇందూర్ ధర్మశాస్త్ర, అయ్యప్ప స్వామికి ఈ నెల 26న జగద్గురు శంకరాచార్యా హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి చేతుల మీదుగా స్వర్ణ ఖడ్గ అలంకరణ జరుగుతుందని ఇందూర్ అయ్యప్ప మందిరం అధ్యక్షుడు భక్తవత్సలం శుక్రవారం తెలిపారు. నగరానికి చెందిన పడాల సురేష్‌గౌడ్ గురుస్వామి స్వర్ణ ఖడ్గ బహూకరణ చేయనున్నారని, అయ్యప్ప మందిరం ప్రధాన అర్చకులు రమేష్ శర్మ, ప్రణవ్ శర్మల వేద మంత్రాల మధ్య విద్యారణ్య భారతి స్వామి అయ్యప్ప స్వామికి స్వర్ణ ఖడ్గాన్ని అలంకరిస్తారని ఆయన తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	64,200	వెండి (కిలో)	74,400
22 క్యారెట్స్	59,200	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	45	60
బెండకాయ	65	80	పచ్చిమిర్చి	40	70
బీరకాయ	60	80	దోసకాయ	25	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	30	60	గోబిగడ్డ	30	50
కాకరకాయ	50	70	గోబిపువ్వు	50	70
వంకాయ	45	65	బీట్‌రూట్	25	50
పాలకూర	20	40	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	60	80
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	60	80
పుదీనా	35	60	చిక్కుడుకాయ	35	60
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	సుందరం మాస్టర్ (తెలుగు) - 11.15, 10.30 భ్రమయుగం (తెలుగు) - 1.50, 7.40 ఈగల్ (తెలుగు) - 4.40
స్క్రీన్-2	ఆర్టికల్ 370 (హిందీ) - 10.40, 4.30 ఊరుపేరు భైరవ కోన (తెలుగు) - 1.45, 10.30, హనుమాన్ (తెలుగు) - 7.30
స్క్రీన్-3	ఆర్టికల్ 370 (హిందీ) - 1.30, 10.30 హనుమాన్ (తెలుగు) - 4.35, సుందరం మాస్టర్ (తెలుగు) - 7.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఆర్టికల్–370 (హిందీ) - 1.00, 7.10, 10.35, సుందరం మాస్టర్ (తెలుగు) - 4.25
స్క్రీన్-2	సిద్ధార్థరాయ్ (తెలుగు) - 1.30, భ్రమయుగం (తెలుగు) 4.40, 10.40, ఊరి పేరు భైరవకోన (తెలుగు)-7.40
స్క్రీన్-3	క్రాక్ జీతేగా తో జీయేగా (హిందీ) - 10.05, 6.35, 9.55, తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతి - 1.25, ఊరి పేరు భైరవకోన (తెలుగు) 3.35
స్క్రీన్-4	ముఖ్యగమనిక (తెలుగు) - 1.05, మస్తు షేడ్స్ ఉన్నయ్‌రా 3.50, హనుమాన్ (తెలుగు) - 6.50, సుందరం మాస్టర్ (తెలుగు) 10.10
దేవి	హనుమాన్ (తెలుగు)
నటరాజ్	క్రాక్ జీతేగా తో జీయేగా (హిందీ)
లలితామహల్	భ్రమయుగం (తెలుగు)
విజయ్	ఊరు పేరు భైరవకోన (తెలుగు)

వేగంగా మరమ్మతులు



నిజామాబాద్ నాగారం: నగరంలో శిథిలావస్థకు చేరిన, విరిగిన స్తంభాలను మార్చేశారు. శుక్రవారం నగరంలోని టౌన్–2 ఏడీఈ తోట రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆయా సెక్షన్‌ల పరిధిలో ధ్వంసమైన విద్యుత్ స్తంభాలను మార్చారు. కంఠేశ్వర్ వద్ద టిప్పర్ ఢీకొనడంతో స్తంభాలు ధ్వంసమవడంతో ఏడీఈ, ఏఈ ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు.

సందేశాత్మక చిత్రం 'ముఖ్య గమనిక'



మాట్లాడుతున్న నటుడు హరిప్రసాద్

నిజామాబాద్ సిటీ: యువతకు మంచి సందేశాన్ని అందించిన చిత్రమని, ప్రజలు ఈ చిత్రాన్ని ఆదరించి విజయవంతం చేయాలని వర్ధమాన సినీ నటుడు యెండల హరిప్రసాద్ అన్నారు. ఆర్మూర్‌కు చెందిన రాజశేఖర్, సాయికృష్ణ నిర్మాతలుగా, వి వేణు మురళీధర్ దర్శకత్వంలో నిర్మించిన ముఖ్య గమనిక చిత్రంలో నిజామాబాద్ ఎల్లమ్మగుట్టకు చెందిన యెండల హరిప్రసాద్ ప్రధాన పాత్ర పోషించారు. శుక్రవారం ముఖ్య గమనిక చిత్రం విడుదలైన సందర్భంగా నిజామాబాద్ నగరంలోని వేణుమాల్ పీవీఆర్‌లో ఈ సినిమాను హరిప్రసాద్ అభిమానులతో తిలకించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ.. తాను చాలా ఏళ్లుగా సినిమాల్లో రాణించాలని ప్రయత్నం చేస్తున్న కృషిలో భాగంగా ముఖ్య గమనిక చిత్రంలో నటించే అవకాశం దక్కిందన్నారు. తన మొదటి చిత్రం ద్వారానే మంచి గుర్తింపు లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సత్య టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ యజమాని సత్యం, మద్ద చంద్రశేఖర్, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు ఏటీఎస్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.